
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 146 వ భాగం

## సూర్య వంశం – 14, రామ కథ - 4

రాముడు వనవాసం చేసినంతకాలం భరతుడు నందిగ్రామంలో ఉన్నాడు ఆయన పాదుకల్ని పట్టుకుని అందువల్ల ముందు నందిగ్రామం చేరాడు రాముడు. శంఖ, చక్రాలే భరత శత్రుఘ్నులుగా పుట్టారని కథ ఉంది కనక వారికి విష్ణువు అంశ ఉన్న రాముడు లేకపోతే కాలూ చేయీ ఆడదు. ఆయన వచ్చేదాకా కళ్ళు కాయలు కాచేటట్టూ చూస్తున్నాడు ఇక్కడ నందిగ్రామంలో. ఇక్కడ భరతుణ్ణి చూసి అందరితో అయోధ్య వెళ్ళాలి. ముందు హనుమంతుణ్ణి పంపాడు భరతుడి దగ్గిరకి తాను ముందు ఇచ్చిన మాట ప్రకారం వస్తున్నట్టూ చెప్పమని.

ఆ. రామచంద్రవిభుని రాక వీనుల విని
భరతుఁ డుత్సహించి పాదుకలను
మోచికొనుచు వచ్చి ముదముతోఁ బురజను
లెల్ల గొలువ నన్న కెదురువచ్చె. [9-316]

ఈ మాట చెవులతో వినగానే భరతుడికి ఉత్సాహం వచ్చింది. పాడుకలని మోసుకుంటూ వచ్చి మిగతా పురజనులతో ఎదురు వచ్చాడు తన అన్న అయిన రాముడికి.

వ. వచ్చి పాదుకల ముందట నిడికొని, యెడనెడ సాష్టాంగదండప్రణామంబులు చేయుచు, మెల్లమెల్లన డాసి, రామచంద్రుని పాదంబులు దన నొసలం గదియించి, తచ్చరణరేణువులు దుడిచి, శిరంబునం జల్లికొని, తనివి చనక, మఱియు నప్పదకమలంబు లక్కున మోపి కొనుచు, సంతసంపుఁ గన్నీటం గడిగి, క్షేమంబు లరయుచుండె; నంత

సీతాలక్ష్మణ సహితుండయి విభుండును, దన కెదురువచ్చిన బ్రాహ్మణ జనంబులకు నమస్కరించి, తక్కినవారలచేత మన్ననలు పొంది, వారల మన్నించె; నయ్యవసరంబున. [9-317]

వచ్చినవాడు పాదుకలు తలమీద పెట్టుకుని సాష్టాంగ దండప్రణామాలు చేస్తూ వచ్చాట్ట. నేను నీ సేవకుణ్ణే సుమా అని చెప్పడానికి. కాళ్ళకి నమస్కారం పెట్టి కన్నీళ్ళతో క్షేమం అడిగాడు. తర్వాత అందర్నీ పలకరించాడు. ఇదే మనం మొత్తం భాగవతంలో అంతా చూసేది – భగవంతుడు ముందు. మిగతావారు తర్వాత. వీళ్ళందర్నీ కలుపుకుని రామచంద్రుడు మరోసారి పుష్పకం ఎక్కాడు. వీళ్ళందరికీ ఖాళీ ఎక్కడ పుష్పకంలో అనడానికి లేదు, ఎందుకంటే ఎంతమంది ఎక్కినా అందులో మరొకరికి చోటు ఉంటుందిట. అలా అయోధ్య బయల్దేరాడు. చాలా కాలానికి నగరానికి వస్తున్నాడు కనక ఇంట్లోంచి బయటకి వచ్చి చూసే వాళ్ళు ఏమంటున్నారో చూడండి. వాళ్ళలో ఎంతమందికి రాముడు అరణ్యవాసానికి వెళ్ళేటప్పుడు ఎలా ఉన్నాడో గుర్తు ఉందో లేదో?

మ. "ఇతఁడే రామనరేంద్రుఁ డీ యబలకా యింద్రారి ఖండించె న
ల్లతఁడే లక్ష్మణుఁ డాతఁడే కపివరుం డా పొంతవాఁడే మరు
త్సుతుఁ డా చెంగట నా విభీషణుఁ" డటంచుం చేతులం జూపుచున్
సతులెల్లం బరికించి చూచిరి పురీసౌధాగ్రభాగంబులన్. [9-325]

'అడుగో ఆ నీలమేఘశ్యాముడే రామచంద్రుడు – సీత (అబల) కోసం రావణుడిని (ఇంద్రారి) ని చంపాడు. ఆ పక్కనే ఉన్న తెల్లనివాడు లక్ష్మణుడు. ఆ పక్కన ఉన్నవాడు కపివరుడు (సుగ్రీవుడు). ఆ పక్కన హనుమంతుడు (మరుత్సుతుడు – వాయు పుత్రుడు), అటువైపు విభీషణుడు' అంటూ చేతులతో చూపిస్తూ భవనాల్లోంచి బయటకి వచ్చి చూస్తూ మాట్లాడుకుంటున్నారుట. వచ్చినవాడు కాబోయే మహారాజు, అజేయ వీరుడు, వచ్చేది రాజమార్గంలో కనక పోతన పద్యానికి వాడిన వృత్తం మత్తేభం.

రాముడు అయోధ్య వచ్చాక మొదట చూడాల్సింది తల్లులని కదా? అదే చెప్తున్నాడు పోతన కింద పద్యాలలో. మొత్తం భాగవతంలో రాసినట్టే ఈ పద్యాలలో కూడా కైక ని కూడా ఎక్కడా నిందించడం మనకి కనిపించదు. ఎవరు ఎలా ఎందుకు ఒక పని చేసారనేది భగవంతుడికి తప్ప మరొకరికి తెలియదు. అందువల్ల అందరం కూడా దైవకార్యం కోసం

కారణభూతులమే కానీ పనిగట్టుకుని ఎవరూ కూడా భగవంతుడి అవతారాన్ని నాశనం చేయరు అని చెప్తున్నట్టూ మనకి భాగవతంలో కనిపిస్తుంది.

ఉ. తల్లులకెల్ల మ్రొక్కి తమ తల్లికి వందన మాచరించి య
ల్లల్ల బుధాళికిన్ వినతుఁడై చెలికాండ్రను దమ్ములం బ్రసం
పుల్లతఁ గౌగలించుకొని భూవరుఁ డోలిఁ గృపారసంబు రం
జిల్లఁగఁ జాల మన్ననలు చేసె నమాత్యులఁ బూర్వభృత్యులన్. [9-329]

తల్లులందరికీ మొక్కి నమస్కారాలు చేసాక పండితులకి (బుధాళికిన్) వినయం చూపించాడు. స్నేహితులని తమ్ములందర్నీ దగ్గిరకి తీసాక, మంత్రులనీ, అంతకు ముందు తెల్సిన సేవకులనీ అందర్నీ పలకరించాడు. ఎవర్నీ మర్చిపోలేదు సుమా రాముడు అని చెప్తున్నాడు కవి. అలా పలకరించిన సీతా రాములని తల్లులేం చేసారు?

చ. కొడుకులుఁ బెద్దకోడలును గొబ్బున మ్రొక్కిన నెత్తి చేతులం
బుడుకుచు మోములుందలలుబోరన ముద్దులుగొంచునవ్వుచుం
దొడలకు వారి రాఁదిగిచి తోఁగఁగఁ జేసిరి నేత్రధారలన్
వెడలిన ప్రాణముల్ దగఁ బ్రవిష్టములయ్యె నటంచు నుబ్బుచున్. [9-331]

దగ్గిరకి తీసుకుని చేతులతో రాస్తూ, పోయిన ప్రాణాలు (వెడలిన ప్రాణముల్) తిరిగి వచ్చాయి (ప్రవిష్టములయ్యె) మాకు అంటూ ఉబ్బిపోయారు కణ్ణీళ్ళతో (నేత్ర ధారలన్)

వ. అంత వసిష్ఠుం దరుగుదెంచి. శ్రీరామచంద్రుని జటాబంధంబు విడిపించి, కులవృద్ధులుం దానును సమంత్రకంబుగ దేవేంద్రుని మంగళస్నానంబు చేయించు బృహస్పతి చందంబున, సముద్రనదీజలంబుల నభిషేకంబు చేయించె; రఘువరుండును, సీతాసమేతుండై, జలకంబులాడి, మంచి పుట్టంబులు గట్టికొని, కమ్మని పువ్వులు దుఱిమి, సుగంధంబు లలందికొని, తొడవులు దొడిగికొని, తనకు భరతుఁడు సమర్పించిన రాజసింహాసనంబునం గూర్చుండి, యతని మన్నించి కౌసల్యకుఁ బ్రియంబు చేయుచు, జగత్పూజ్యంబుగ రాజ్యంబు జేయుచుండె; నప్పుడు. [9-332]

కులగురువు వచ్చి తలలో పేరుకున్న బంధనాలన్నీ విడిపించి మంగళ స్నానం చేయించి రాజుగా అభిషేకించాడు. ఇది భరతుడు తనకి ఇచ్చిన సింహాసనం తిరిగి రాముడికి సమర్పించినది. అలా రాజ్యం చేయడం మొదలుపెట్టాడు – లోకాలని మంగళం కలిగేలాగా (జగత్పూజ్యంబుగా). ఇక్కడనుంచి ఉత్తర రామాయణం మొదలుతుంది – లవ కుశలూ, మిగతా కథా. అది అందుకునే ముందు పోతన అద్భుతమైన సీస పద్యంతో రామరాజ్యం ఎలా ఉందో చెప్తున్నాడు చూడండి. ఇటువంటి పద్యాలు చూసే భాగవత రసగుళికలని అనేక "సీసా"లతో తాగమని మనకి అందించారు పోతన అంటారు ఈ పోతన భాగవతానికి ముందు మాట రాసిన శ్రీ నండూరి కృష్ణమాచార్య గారు.

సీ. కలఁగు టెల్లను మానెఁ జలధు లేడింటికి–
జలనంబు మానె భూచక్రమునకు;
జాగరూకత మానె జలజలోచనునకు–
దీనభావము మానె దిక్పతులకు;
మాసి యుండుట మానె మార్తాండవిధులకుఁ–
గావిరి మానె దిగ్గగనములకు;
నుడిగిపోవుట మానె నుర్వీరుహంబుల–
కడఁగుట మానె ద్రేతాగ్నులకును; [9-333]

ఆ. గడిఁది వ్రేఁగు మానెఁ గరి గిరి కిటి నాగ
కమఠములకుఁ బ్రజల కలఁక మానె;
రామచంద్రవిభుఁడు రాజేంద్రరత్నంబు
ధరణిభరణరేఖఁ దాల్చు నపుడు. [9-333.1]

సప్త సముద్రాలకి పొంగటం/కంపించడం అన్నది లేదు (కలఁగు టెల్లను మానెఁ జలధు లేడింటికి). భూమండలం నిర్భయంగా ఉంది (జలనంబు మానె భూచక్రమునకు); విష్ణుమూర్తికి (జలలోచనునికి) జాగ్రత్తగా అసురలని గమనించే అవసరం రాలేదు (జాగరూకత మానె). అష్టదిక్పాలురకి దీనత్వం కలగలేదు (దీనభావము మానె దిక్పతులకు). సూర్య చంద్రులకి వెలవెల పోవడం అన్నది లేదు (మాసి యుండుట మానె మార్తాండవిధులకు), ఆకాశం కావిరంగులో ఉండడం

జరగలేదు (గావిరి మానె దిగ్గగనములకు). చెట్లు ఎండిపోవడం అన్నది లేదు (నుడిగిపోవుట మానె నుర్వీరుహంబులకు; ఉర్వీ రుహంబులు – చెట్లు). యజ్ఞంలో త్రేతాగ్నులు ఆరిపోవడం అన్నదే లేదు (కడఁగుట మానె ద్రేతాగ్నులకు). భూ భారం తగ్గిపోయింది కనక పర్వతాలకీ (గిరి), వరాహమూర్తికీ (కిటి) ఆదిశేషుడికీ, (నాగ), కూర్మమూర్తులకి (కమఠము) స్వాంతనంగా ఉంది. పజలలో కలకలు, దెబ్బలాటలు తగ్గాయి. ఇదంతా జరిగింది రాజుల్లో శ్రేష్టుడైన (రాజేంద్ర రత్నంబు) రామచంద్రుడు భూభారాన్ని వహించినప్పుడు (ధరణి భరణ రేఖ తాల్చునపుడు).

క. తండ్రి క్రియ రామచంద్రుఁడు
తండ్రుల మఱపించి ప్రజలఁ దా రక్షింపన్
తండ్రుల నందఱు మఱచిరి
తండ్రిగదా రామచంద్రధరణిపుఁ డనుచున్. [9-336]

రాజు అందరికీ తండ్రి కదా? రాజ్యంలో తండ్రులనందర్నీ మరిపిస్తూ ప్రజలని రక్షిస్తూన్నప్పుడు, తమ స్వంత తండ్రులనే మర్చిపోయారు ప్రజలు. ఈ పద్యంలో "తండ్రి" అనే పదాన్ని పోతన ఎలావాడాడో మరో సారి చూడండి. ప్రతీ పదంలో అదే పదం వాడినా అర్ధం సులభంగా ఉండి పద్యంలో మంచి అలంకారం కనిపిస్తుంది.

వ. మఱియు, నా రామచంద్రుండు రాజర్షి చరితుండును, నిజధర్మనిరతుండును, నేకపత్నీవ్రతుండును, సర్వలోక సమ్మతుండును నగుచు ధర్మవిరోధంబు గాకుండఁ గోరిక లనుభవించుచుఁ ద్రేతాయుగంబైన గృతయుగధర్మంబుఁ గావించుచు, బాలమరణంబు మొదలగు నరిష్టంబులు ప్రజలకుఁ గలుగకుండ రాజ్యంబుచేయుచుండె; నయ్యెడ [9-337]

అలా రామచంద్రుడు ఏకపత్నీ వ్రతుడై, ధర్మంతో రాజ్యం చేసినపుడు ఎక్కడా బాలమరణాలు లేవు, అరిష్టాలు కలగలేదు. ఆయన రాజ్యం చేసింది త్రేతాయుగం అయినా కృతయుగంలో ధర్మం ఉన్నట్టూ రాజ్యం చేసాడు. కృత యుగంలో అని చెప్పడం ఎందుకంటే అది ధర్మం నాలుగు పాదాలతో నడిచే యుగం. త్రేతాయుగం వచ్చే సరికి ఒక పాదం పోగొట్టుకుని మూడు పాదాలతో ఉంటుంది ధర్మం. త్రేతాయుగం అనేది చాలా పెద్దది. అందులో రాముడు రాజ్యం చేసింది కొంతకాలం మాత్రమే. అయినా సరే రాముడి కాలంలో ధర్మం నాలుగు పాదాలతో నడిచిందిట. ఈ ధర్మం ఒక్కో యుగంలో ఒక్కొక్క పాదం పోగొట్టుకుంటూ కలియుగంలో ఒకే పాదం తో నడుస్తుందని అంటారు.

ఆ. భ్రాతృజనుల యందు బంధువులందును
ప్రజల యందు రాజభావ మొంది
యెట్లు మెలఁగె? రాఘవేశ్వరుం డెవ్వనిఁ
గూర్చి క్రతువు లెట్లు గోరి చేసె? [9-340]

ఇక్కడకొచ్చేసరికి పరీక్షిత్తుకో ధర్మ సందేహం, తాను కూడా స్వంతంగా రాజు కనక. రాముడు బాగా రాజ్యం చేసాడు అని చెప్తున్నాడు కదా శుకమహర్షి? అందుకునే అడుగుతున్నాడు – శతృమితృలతో, బంధువులతో, ప్రజలతో రాముడు ఎలా మెలిగాడు? తానే స్వంతంగా భగవత్స్వరూపుడు కదా, అందువల్ల ఎవర్ని ఉద్దేశించి ఏమేమి క్రతువులు, యజ్ఞాలు చేసాడు? ఏవైనా చేస్తే ఏమి కోరుకుని చేసాడు వీటిని? ఇలా ఎందుకు అడిగాడో సులభంగా అర్ధం చేసుకోవచ్చు. మొదటిది తాను రాజసూయం వంటి యజ్ఞాలు చేసిన యుధిష్టిరుడి వంశం వాడు. రెండోది రాముడి వంశంలో రఘువు మొదలైనవారు ఎలా యజ్ఞాలు చేసారో ముందు విన్నాడు శుకమహర్షి నుండి.

దీనికి శుకమహర్షి ఇచ్చే సమాధానం వచ్చే నెల చూద్దాం.

.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS